సాక్షి సిద్దిపేట

మంగళవారం । 28 । జనవరి । 2025



జాతరో జాతర

కూడవెల్లి, మోయతుమ్మెద జతరలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సర్వం సిద్ధం చేశారు.

వివరాలు 8లో ▸



దాడి కేసులో ఇద్దరి అరెస్టు

పాత కక్షల నేపథ్యంలో దంపతులపై దాడి చేసి పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

వివరాలు 8లో ▸



పగలే వెలుగుతున్న..

పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ వృథా అవుతోంది.

– వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేటి నుంచి సిటీ పోలీస్‌యాక్టు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో మంగళవారం నుంచి సిటీ పోలీస్‌యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఈ నెల 28నుంచి వచ్చే నెల 12 వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. ఈ సమయంలో ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా అమల్లో ఉంటాయని ఆమె పేర్కొన్నారు.

ఏకాగ్రతతో చదివితేనే సత్ఫలితాలు



టెన్త్ విద్యార్థులతో కలిసి క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఏకాగ్రతతో చదివితేనే సత్ఫలితాలు సాధ్యమని సామాజిక సమరసత వేదిక జిల్లా కన్వీనర్ మాలె రమేశ్ అన్నారు. ధర్మారంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సోమవారం టెన్త్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను ఉచితంగా అందించారు. నూతన క్యాలెండర్లను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. పరీక్షల కోసం ఏవిధంగా సన్నద్ధం కావాలో అవగాహన కలిగించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలని సూచించారు. ధర్మారం గ్రామానికి చెందిన విద్యార్థులు టెన్త్‌లో 10 జీపీఏ సాధిస్తే ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు పురస్కారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో సమరసత వేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంగనాయక సాగర్ నీటిని విడుదల చేయండి

ఇరిగేషన్ ఈఈకి రైతుల వినతి



ఇరిగేషన్ ఈఈకి వినతి పత్రం అందజేస్తున్న అక్కెనపల్లి రైతులు

నంగునూరు(సిద్దిపేట): రంగనాయకసాగర్ కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని అక్కెనపల్లి రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం ఇరిగేషన్ ఈఈ గోపాలకృష్ణకు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది రైతులు నాట్లు వేశారని, బావుల్లో సరిపడా నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని రోజుల కిందట మంత్రి కొండా సురేఖ రంగనాయకసాగర్ నీటిని వదిలారని, కుడి కాల్వ ద్వారా నీటిని వదిలితేనే నంగునూరు మండలానికి నీరు చేరుతుందన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో నీటిని వదులుతామని అధికారులు చెప్పారని, పంటలు ఎండిపోకముందే నీటిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎడ్ల సోమిరెడ్డి, నాగేందర్, సుధాకర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలి

పీఆర్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి శశిధర్ శర్మ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

వర్గల్(గజ్వేల్): సీపీఎస్, యూపీఎస్‌లను రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్ శర్మ డిమాండ్ చేశారు. యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)కు వ్యతిరేకంగా సోమవారం వర్గల్ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ బాల్‌రాజుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు జరిగి, ఓపీఎస్ సాధించే వరకు ఉద్యమిస్తూనే ఉంటామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న తరుణంలో మరింత నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానంపై గెజిట్ ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి నరసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చల్లంగ చూడు.. పోచమ్మ తల్లీ



కొండపోచమ్మ ఆలయం ఎదుట భక్తుల సందడి

పోచమ్మ తల్లీ.. చల్లంగ చూడు అంటూ భక్తులు ప్రణమిల్లారు. సోమవారం భక్తులు జగదేవ్‌పూర్ మండలంలోని కొండపోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఏటా కొండపోచమ్మ ఉత్సవాలు ఎనిమిది వారాలు కొనసాగుతాయి. ఈ క్రమంలో ఆది, సోమ, మంగళవారాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

పురపాలికల్లో ప్రత్యేక సవాళ్లు

గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాలలో ప్రత్యేక పాలన షురూ

- నాలుగు మున్సిపాలిటీలకూ ఒక్కరే అధికారి
- మాజీలైన మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు

పట్టణాల్లో ప్రత్యేక అధికారి పాలన ప్రారంభమైంది. గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 26తో ముగిసింది. దీంతో నాలుగు మున్సిపాలిటీలకూ ప్రత్యేక అధికారిగా సోమవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్ బాధ్యతలు స్వీకరించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరీమా అగర్వాల్ సెలవులో ఉండటంతో ఇన్‌చార్జిగా హమీద్ కొనసాగుతున్నారు. ఒక్కరే నాలుగు మున్సిపాలిటీలలో సమస్యలు ఎలా పరిష్కరిస్తారని, బాధ్యతలు నిర్వర్తించడం కష్టసాధ్యమైన పనేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సాక్షి, సిద్దిపేట: మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన అదనపు కలెక్టర్‌కు అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. దుబ్బాక పట్టణంలో ఇరుకు రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల విస్తరణపై దృష్టిపెట్టాలి. అలాగే దుబ్బాక పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి. రింగ్ రోడ్ నిర్మాణం చేపడితే కొంత ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చాలా చోట్ల పెండింగ్‌లోనే ఉన్నాయి.

ఎస్సీ వసతి గృహంలో నిర్వహణ..

చేర్యాల మున్సిపాలిటీకి సొంత భవనం లేకపోవడంతో ఎస్సీ వసతి గృహంలో నిర్వహిస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేసి అందులో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను నిర్మించాలనుకున్నారు. కానీ నిర్మాణం చేపట్టలేదు. ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చివేయడంతో మున్సిపాలిటీ ఆదాయం కోల్పోయింది. అన్ని మున్సిపాలిటీలలో సిబ్బంది కొరత ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అవినీతికి పాల్పడే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సమస్యలు పరిష్కారం అయ్యేనా?

గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు బాధ్యతలు అప్పగించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ సెలవులో ఉండటంతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్‌కే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటు రెవెన్యూ, మరో పక్క స్థానిక సంస్థలు, నాలుగు మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా విధులు నిర్వర్తించాలి. గతంలో డివిజనల్ రెవెన్యూ అధికారులకు (ఆర్డీఓ) బాధ్యతలు అప్పగించే వారు. ఈసారి అన్ని అదనపు కలెక్టర్‌కే అప్పగించారు. ఒక్కరే అధికారి నాలుగు మున్సిపాలిటీలలో సమస్యల పరిష్కారానికి నోచుకోనేనా? ప్రజలకు మరింత అందుబాటులో సేవలు అందేనా? అని సర్వత్రా చర్చించుకుంటున్నారు.

మున్సిపాలిటీ	వార్డులు	గృహాలు	జనాభా
గజ్వేల్	20	11,616	37,026
దుబ్బాక	20	8,500	27,500
హుస్నాబాద్	20	8,380	22,082
చేర్యాల	12	5,166	18,310

మాజీలైన కౌన్సిలర్లు

గజ్వేల్ మున్సిపాలిటీ ఛైర్మన్ రాజమౌళి, దుబ్బాక , చేర్యాల, హుస్నాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్లు గన్నె వనితారెడ్డి, అంకుగారి స్వరూపరాణి, రజితలతో పాటు 68 మంది కౌన్సిలర్లు, 16 మంది కో ఆప్షన్ సభ్యులు మాజీలయ్యారు. ఇప్పటికే జిల్లా, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. తాజాగా పట్టణాలు సైతం ప్రత్యేక పాలన ప్రారంభమైంది. సిద్దిపేట మున్సిపాలిటీ తప్ప అన్ని స్థానిక సంస్థలు ప్రత్యేక పాలనలోనే కొనసాగుతున్నాయి. సిద్దిపేట మున్సిపాలిటీ పదవీ కాలం ఏప్రిల్ 2026 వరకు ఉంది.



పోటీ పరీక్షల పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న బీఎస్‌రావు, రవినాథ్ తదితరులు

ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి

సిద్దిపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పలువురికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని డాక్టర్ బీఎస్‌రావు ఫౌండేషన్ ఫౌండర్ బీఎస్ రావు, ప్రభుత్వ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవినాథ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులకు పోటీపరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు మౌలిక సదుపాయాలు, పవర్–ఎనర్జీ, వ్యవసాయం, హెల్త్ కేర్, ఔషధ రంగం, ఫైనాన్స్, రిటైల్ , ఈ కామర్స్, టూరిజం అండ్ హాస్పిటాలిటీలలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, 4లక్షల ప్రైవేట్ ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయన్నారు. విద్యార్థులు సమస్యల వైపు కాకుండా తమ బంగారు భవిష్యత్‌ను నిర్మాణం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ సతీష్, డాక్టర్ శ్రీనివాస్, శంషాద్ అలి, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి

సిద్దిపేటరూరల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టంలో ఉన్న హక్కులు, న్యాయ సేవలను గురించి అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి స్వాతిరెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని బుస్సాపూర్ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ ఎవరైనా చిన్నారులతో అసభ్యకరంగా వ్యవహరించినా, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలేవీ?

- అధికారుల తీరుపై కౌన్సిలర్ల మండిపాటు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

సిద్దిపేటజోన్: ఆదర్శ పట్టణంగా మారుతున్న సిద్దిపేట మున్సిపాలిటీలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్నా అధికారులు చర్యలు చేపట్టడంలేదని పలువురు కౌన్సిలర్లు మండిపడ్డారు. సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగింది. పట్టణంలో ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు వాపోయారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ రియాజ్ డిమాండ్ చేశారు. ఇదే అంశంపై కౌన్సిలర్లు బ్రహ్మం, ప్రవీణ్‌లు జోక్యం చేసుకొని తక్షణం చర్యలు చేపట్టాలని పట్టుబట్టారు. స్పందించిన ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ వారంలో రెండు రోజుల పాటు ఫుట్ పాత్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం దాటిందని, పట్టణంలో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని, జిల్లా మంత్రి స్పందించి మున్సిపాలిటీకి రూ.25 కోట్లు మంజూరు చేయాలని కౌన్సిలర్ ప్రవీణ్ కౌన్సిల్ పక్షాన కోరారు. దీనికి పలువురు కౌన్సిలర్లు మద్దతు పలికారు.



సమావేశంలో ఛైర్‌పర్సన్ మంజుల, వైస్ ఛైర్మన్ కనకరాజు, హాజరైన కౌన్సిలర్లు

బ్రిడ్జి రేలింగ్ కూల్చివేసినా..

ఇటీవల హైదరాబాద్ రోడ్డులోని బ్రిడ్జి రెలింగ్‌ను కొందరు కూల్చివేశారని, అయినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్లు వినోద్, రవి డిమాండ్ ప్రశ్నించారు. స్పందించిన కమిషనర్ ఆశ్రిత్ మాట్లాడుతూ.. ఈ ఘటన పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంటి యజమాని ద్వారా మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలో ఫాగింగ్ సక్రమంగా జరగడం లేదని, మిషన్ మరమ్మతు చేసి ఫాగింగ్ చేయాలని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ బాల్ లక్ష్మి కోరారు. మరో కౌన్సిలర్ శోభారాణి మాట్లాడుతూ.. పట్టణంలో వీధి దీపాలు వెలగడం లేదని, కొత్తగా దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సోలార్ వ్యవస్థ ద్వారా కరంట్ బిల్లు తగ్గే అవకాశం ఉందని కౌన్సిలర్ రవి సూచించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ సమయంలో రెవెన్యూ అధికారులు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందని కౌన్సిలర్ రవి సూచించారు. అంతకుముందు పలు అంశాలపై సభ్యులు చర్చించారు. అనంతరం ఎజెండా అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

31,170 మందికి రూ.35.40కోట్లు

రైతు భరోసా నిధులు జమ



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా పథకం ద్వారా జిల్లాలో 31,170 మంది రైతులకు రూ.35.40కోట్లు జమ అయ్యాయి. నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక సోమవారం తెలిపారు. 26 మండలాల పరిధిలోని ఒక్కో గ్రామం చొప్పున 31,170 మందికి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయన్నారు. మిగతా రైతులకు త్వరలోనే జమకానున్నాయని తెలిపారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులు 117

సిద్దిపేటరూరల్: ప్రజావాణికి వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. అర్జీలను వెంటనే పరిష్కరించి మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో అందిస్తున్న అర్జీలను అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యల పరిష్కారం కోరుతూ 117 దరఖాస్తులు వచ్చాయి.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్యా, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని చూపుతున్న నర్సింగం

చర్యలు తీసుకోండి

నాపేరు తోట్ల నర్సింగం. మాది చిన్నకోడూరు మండలం ఎల్లాయపల్లి గ్రామం. గ్రామ పంచాయతీకి చెందిన రూ.17లక్షలు దుర్వినియోగానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి వెంటనే నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి.

‘కూడవెల్లి’లోకి సాగునీరు వదలాల్సిందే



రహదారిపై బైఠాయించిన రైతులు

రైతుల రాస్తారోకో

మిరుదొడ్డి(దుబ్బాక): కూడవెల్లి వాగులోకి మల్లన్న సాగర్ నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. రైతుల ఆందోళనకు బీజేపీ నాయకులు కృష్ణ, భాను తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కూడవెల్లి వాగులో నీరు లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరీవాహక ప్రాంతాల్లో వేసిన వరి నాట్లకు సైతం నీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టులో పుష్కలమైన సాగు నీరు ఉన్నప్పటికీ, కూడవెల్లి వాగులోకి నీటిని వదలడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని కోరారు. లేదంటే మల్లన్న సాగర్ గేట్లను తామే ఎత్తివేస్తామని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న భూంపల్లి పోలీసులు రైతులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం వాగులోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. కాగా రైతుల ఆందోళనతో సిద్దిపేట–రామాయంపేట రహదారికి రువైపులా వాహనాలు భారీగా నిలిచి పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

సీఎం కృషి వల్లే పారిశ్రామిక ప్రగతి

పీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు

గజ్వేల్: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. సోమవారం గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. దావోస్ పర్యటనల ద్వారా సీఎం రేవంత్.. రూ.2లక్షల కోట్ల పెట్టుబడులను సాధించారని కొనియాడారు. దీని ద్వారా యువతకు భారీఎత్తున ఉపాధి అవకాశాలు దక్కే అవకాశం కలిగిందన్నారు. గజ్వేల్ నియోజకవర్గ సమస్యలను మాజీ సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇక్కడి ప్రజల సమస్యలను తెలుసుకొని అసెంబ్లీలో చర్చించాలని ఆయన కోరారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, గోపాల్ రావు, వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రావు

అధికారులు నిబద్ధతతో పని చేయాలి: డీఐఈఓ



మాట్లాడుతున్న డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేట ఎడ్యుకేషన్: విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలని డీఐఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. ఇంటర్మీడియెట్ విద్యలో ఇటీవల నియామకమైన అకాడమిక్ మానిటరింగ్ అధికారులతో సోమవారం స్థానిక కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉత్తీర్ణతాన్ని పెంచేందుకు ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో చేపట్టే కార్యక్రమాల అమల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు.

క్లుప్తంగా

వర్గల్ క్షేత్రంలో విద్యాశాఖ డైరెక్టర్ పూజలు


కుటుంబ సభ్యులతో వెంకటనర్సింహారెడ్డి

వర్గల్(గజ్వేల్): మూల నక్షత్ర మహోత్సవం సోమవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈ వెంకటనర్సింహారెడ్డి కుటుంబ సమేతంగా వర్గల్ శ్రీ విద్యాసరస్వతీ క్షేత్రం సందర్శించారు. ఆయనకు ఆలయ కమిటీ ప్రతినిధులు సాదర స్వాగతం పలికారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకొని విశేష పూజలు జరిపించారు. వేద పండితుల మహదాశీర్వచనం, అమ్మవారి ఆశీస్సులు పొందారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ వర్గాలు శేషవస్త్రంతో సముచిత సన్మానం చేశారు.

యువకుడి అదృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): యువకుడు అదృశ్యమైన ఘటన చిలప్‌చెడ్ మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. సోమవారం ఎస్‌ఐ నర్సింలు కథనం మేరకు.. గంగారం గ్రామానికి చెందిన వడ్డె రాజు (27), భార్య రాణితో తరుచూ గొడవ పడేవాడు. 20న రాణి తల్లితండ్రులు ఇంటికొచ్చారు. ఆ రోజూ కూడా భార్య, ఆమె తల్లిదండ్రులతో సైతం గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. రాజు తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పు కింద నకిలీ బంగారం

మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పు కిందికి నకిలీ బంగారు బ్రాస్‌లైట్ ఇచ్చి మోసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రమైన కౌడిపల్లికి చెందిన మార్వాడి ఉదారాం హరిఓం హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇతడికి పైపులు సరఫరా చేసే కుత్బుల్లాపూర్‌కు చెందిన సునీల్ చౌదరి, రాకేష్‌కు గతేడాది రూ.20 వేలు అప్పుగా ఇచ్చాడు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగగా ఇవ్వడం లేదు. 25న సునీల్‌చౌదరి, రాకేష్ కౌడిపల్లికి వచ్చి మార్వాడి ఉదారాంకు ఇవ్వాల్సిన రూ.20 వేలకు బదులుగా 3.02 తులాల బంగారు బ్రాస్ లైట్ ఇచ్చి అప్పు డబ్బులు తీసుకొని మిగితా డబ్బులు ఇవ్వాలని చెప్పారు. సోమవారం డబ్బులు కావాలని ఫోన్ చేయగా ఉదారాం బంగారం షాపులోకి వెళ్లి బ్రాస్ లైట్‌ను చెక్ చేయగా నకిలీదని తేలింది. నకిలీ బంగారం ఇచ్చి మోసం చేసిన ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొమురయ్య విగ్రహం నిర్మాణానికి భూమిపూజ

కోహెడ(హుస్నాబాద్): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు దొడ్డి కొమురయ్య విగ్రహం ఏర్పాటుకు కోహెడ మండల కురుమ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. విగ్రహం ఏర్పాటుకు ముందుకొచ్చిన మండల కురుమ సంఘాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజమల్లయ్య అభినందించారు. కార్యక్రమంలో కర్ర శ్రీహరి, నిర్మల, ధర్మయ్య, లక్ష్మణ్, జగన్‌రెడ్డి, వెంకటేశం, వంశీధర్‌రెడ్డి, ఎల్లయ్య, కొమురయ్య, కోనె శేఖర్, చుక్క అశోక్, రమేశ్, నర్సింహులు, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

వర్గల్(గజ్వేల్): రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా వాహన ప్రమాదాలను నివారించవచ్చని వర్గల్ మండలం గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం గౌరారం అల్యూమినియం కంపెనీ వద్ద కార్మికులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. వాహన డాక్యుమెంట్లు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు.

జాతరో జాతర

రేపటి నుంచే కూడవెల్లి రామలింగేశ్వరస్వామి, సింగరాయ లక్ష్మీ నర్సింహస్వామి జాతర్లు


కూడవెల్లి రామలింగేశ్వరదేవాలయం

మాఘ అమావాస్య జాతరలతో కూడవెల్లి, మోయతుమ్మెద వాగుల తీరాలు భక్తులతో సందడిగా మారనున్నాయి. బుధవారం నుంచే ప్రారంభమయ్యే జాతర్లకు గాను అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయం, కోహెడ్‌లోని శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఒక్క రోజే రెండు జాతర్లు ప్రారంభం అవుతుండటంతో భక్తులు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. రెండు ఆలయాలు చుట్టుపక్కల ఎంతో ప్రసిద్ధిగాంచినవి కావడంతో జాతరకు సరిహద్దు జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో రానున్నారు. ఆలయ నిర్వాహకులు సైతం భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తాత్కాలికంగా స్నానపు గదులు

ఆలయానికి వచ్చే భక్తులు క్యూ పద్ధతిలో వెళ్లి దైవ దర్శనం చేసుకోవడానికి బారికేడ్లు ఏర్పాటు చేశారు. నీటి గుండంలో స్నానమాచరించే భక్తులకు తాత్కాలికంగా స్నానపు గదులు నిర్మించారు. ముందస్తుగా దేవాలయ ఆవరణలో మిఠాయిల దుకాణాలు, ఇతర బొమ్మల దుకాణాలు వెలిశాయి. అదే విధంగా దేవాలయ ఆవరణలో శాంతిభద్రతలకు ఆటంకం కలగకుండా ప్రత్యేకించి పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.


భక్తులు స్నానమాచరించే నీటి గుండాలు

- మాఘ అమావాస్య రోజు పెద్ద ఎత్తున నిర్వహణ
- ముస్తాబైన ఆలయాలు
- భారీ సంఖ్యలో భక్తులు రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో 29 నుంచి జాతర ప్రారంభమవుతుంది. జాతరకు సరిహద్దు జిల్లాలైన మెదక్, సంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, రాజన్నసిరిసిల్లా జిల్లా, కరీంనగర్ జిల్లాలకు చెందిన భక్తులే కాకుండా సరిహద్దు రాష్ట్రాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తారు. ఐదు రోజుల వరకు ఈ జాతర జరుగుతుంది. కూడవెల్లికి తూర్పు దిక్కున పెద్ద వాగు, పడమరన చిన్నవాగు ఉంటాయి. ఈ రెండు వాగులు ఒకే చోట ఉత్తర దిశన ప్రవహిస్తాయి. మాఘ అమావాస్య రోజున కూడవెల్లి వాగులో స్నానం చేస్తే సకల పాపాలు తొలగి పోతాయని భక్తుల నమ్మకం. జాతర దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

క్షేత్రంలో గల దేవాలయాలు

రామలింగేశ్వరాస్వామి దేవాలయంలో శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి, రాధ రుక్మిణి వేణు గోపాలస్వామి, మహా గణపతి, వీరభద్ర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి, బొబ్బిలి వీరన్న, హనుమాన్ దేవాలయాలు కలవు. కూడవెల్లి వాగులో మాఘ అమావాస్య రోజున శ్రీరామ చంద్రుడు వాగులో స్నాన మచారించాడు గనుగ అదే రోజు భక్తులు వాగులో స్నానమాచరించి దైవ దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగి పోతాయని భక్తుల నమ్మకం.

పూజా కార్యక్రమాలు

మాఘ అమావాస్య బుధవారం రోజున స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సర్వదర్శనం, సాయంత్రం స్వామి వారిని పల్లకీ సేవలో ఊరేగిస్తారు. శుక్రవారం ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం స్వామి వారికి అభిషేకం, బిల్వా అర్చన తదితర పూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం రోజు ప్రతఃకాల స్వామి వారికి విశేష దేవ్యాలతో అభిషేకం బిల్వార్చన పుష్పార్చన, మంత్రపుష్పం హారతి తీర్థప్రసాద వితరణ భక్తులకు సర్వదర్శనాలు. ప్రదోష కాలంలో అభిషేకం అర్చన హారతి మంత్రపుష్పం తీర్థ ప్రసాద్ వితరణ.


దేవాలయ ఆవరణలో ..

ప్రకృతి ఒడిలో సింగరాయుడు


లక్ష్మీనర్సింహస్వామి

కోహెడ(హుస్నాబాద్): చుట్టూ ఎత్తైన కొండలు, పచ్చని చెట్లు, జల జల పారే సేలయేరు ప్రకృతి రమణీయాల మధ్య శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీ నర్సింహస్వామి కొలువు దీరారు. కూరెల్లా, తంగళ్లపల్లి, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల సరిహద్దులో 29న జాతర వైభవంగా జరుగనుంది. కాకతీయుల కాలంలో ప్రతాపరుద్రుడు, సింగరాయ అనే వాస్తుశిల్పిని మోయతుమ్మెద వాగుపై ప్రాజెక్టు నిర్మాణానికి పంపారు. ప్రాజెక్ట్ వద్ద ఉన్న ప్రకృతి దృశ్యాలకు ఆయన మంత్రముగ్ధుడై అక్కడే స్థిరపడ్డాడని చరిత్రకారులు చెబుతారు. ఆయన మరణాంతరం కాకతీయులు రాజైన ప్రతాపరుద్రుడు, వాస్తు శిల్పి సింగరాయల పేర్లను కలుపుకొని శ్రీ ప్రతాపరుద్ర సింగరాయ లక్ష్మీనర్సింహ జాతరగా కొనసాగుతూ ప్రసిద్ధికెక్కింది. జాతరకు తెలంగాణ జిల్లాల నుంచి, మహారాష్ట్రలోని ముంబాయి, పూణే, షోలాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక రోజు జాతర జరగడం విశేషం. కోహెడ, శనిగరం, బస్వాపూర్, గుండారెడ్డిపల్లి గ్రామాల నలువైపుల నుంచి చేరేందుకు భక్తులకు రహదారులున్నాయి.

జాతర ప్రత్యేకత..

జాతరలో చిక్కుడు, టమాట, వంకాయ కూరగాయల మిశ్రమ శాఖాహార వంటలు వండుకొని కుటుంబ సభ్యులు సహా పంక్తి భోజనాలు భుజించడం ఇక్కడి ప్రత్యేకత. తూర్పు నుంచి పడమరకు పారే సేలయేరు ఉండటంతో దక్షిణకాశీగా అభివర్ణిస్తారు. ఈ సేలయేటిలో స్నానాలు ఆచరిస్తే చర్మవ్యాధులు నయమవుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రెవెన్యూ శాఖ పరిధిలో నిర్వహణ..

కూరెల్లా, తంగళ్లపల్లి గ్రామాల మధ్య సరిహద్దుపై జాతర నిర్వహణలో వివాదం గత దశాబ్ది కాలం నుంచి నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు గ్రామాల పెద్దలతో తహసీల్దార్ సురేఖ, ఎస్‌ఐ అభిలాష్ ఇటీవలె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఇరు గ్రామాల పెద్దల వాదనలు విన్నారు. వారి మధ్య సక్యత కుదరకపోవడతో రెవెన్యూ శాఖ జాతర నిర్వహణ బాధ్యతలు తీసుకుంది.

సీసీ కెమెరాలు ఏర్పాటు



ఆలయంలో భక్తుల సౌకర్యార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రత్యేకించి పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాం. భక్తులకు సహాయం పడేందుకు వాలంటీర్లను ఏర్పాటు చేశాం. మెడికల్ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు. భక్తులకు ఏమైనా ఇబ్బందులు కలిగితే కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేయాలి.

–విశ్వనాథశర్మ, ఆలయ ఈఓ

ఐదు రోజులు జాతర



మాఘ అమావాస్య సందర్భంగా జాతర ప్రారంభమతుంది. మాందవ్య నదిలో పుణ్య స్నానాలు చేస్తారు. ఐదు రోజుల వరకు జాతర కొనసాగుతుంది. భక్తులు క్యూ లైన్‌లో వెళ్లి దైవ దర్శనం చేసుకోవాలి. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

– సంకేత్ శర్మ, ఆలయ అర్చకులు

దాడి కేసులో ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేటఅర్బన్: పాత కక్షల నేపథ్యంలో భార్యాభర్తలపై దాడి చేసి పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన తాళ్లపల్లి పరుశరాములు, నాగలక్ష్మి దంపతులకు వారి దాయాదులైన తాళ్లపల్లి నర్సింహులు, తాళ్లపల్లి చంద్రంకు మధ్య చాలా కాలంగా వ్యవసాయ భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. గతేడాది డిసెంబర్ 18న తాళ్లపల్లి పరుశరాములు అతడి భార్యను నర్సింహులు, చంద్రం కట్టెలతో కొట్టి గాయపరిచారు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడు

దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. పొన్నాల శివారులోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిందితుడి వివరాలను వెల్లడించారు. సిద్దిపేట పట్టణం మైత్రీవనంలో నివాసం ఉండే బొమ్మగోని రమేశ్ 14న కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వరం వెళ్లాడు. ఇంట్లోని బంగారు నగలను వెంట తీసుకెళ్లేందుకు ఓ పర్సులో పెట్టుకొని ఇంటి మెట్ల వద్ద పెట్టి మర్చిపోయారు. వారు వెళ్లిన తర్వాత ఇంట్లో కిరాయికి ఉండే మల్లేశం వచ్చి నగలు ఉన్న పర్సును గుర్తించి అపహరించాడు. రమేశ్ ఇంటికి వచ్చిన తర్వాత మల్లేశంను విచారించగా తనకు కనిపించలేదని చెప్పాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు నగలు అపహరించినట్లు గుర్తించారు. సోమవారం అదుపులోకి తీసుకొని ఆరు తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడు చందు

చేర్యాల(సిద్దిపేట): గుర్తు తెలియని వ్యక్తుల సంచారంతో కలకలం.. ఆందోళన చెందుతున్న కాలనీవాసులు అని సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన పోలీసులు ప్రత్యేక బృందాలతో సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎల్.శ్రీను కథనం మేరకు.. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ పీ.నీరేశ్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పట్టణ పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు పరిశీలించాం. తనిఖీల్లో కొండపాక మండలం నాచారం గ్రామానికి చెందిన యామ చందుగా గుర్తించి అరెస్టు చేసి విచారించాం. పట్టణ కేంద్రం నుంచి నర్సాయపల్లి వెళ్లే దారిలోని ఎల్లమ్మ గుడిలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడని, ఏదైనా దొంగతనం చేద్దామని శ్రీనగర్ కాలనీలో తిరిగినట్లు తెలిపాడన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ

- పరిశ్రమకు కరెంట్ సరఫరా కోసం రూ.50 వేలు డిమాండ్



మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమకు కరెంట్ సరఫరా చేయడానికి రూ.50 వేలు డిమాండ్ చేసిన విద్యుత్‌శాఖ ఏఈ ఏసీబీ అధికారులకు చిక్కాడు. సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కొండాపూర్ పరిశ్రామిక వాడలో నూతనంగా లక్కీ ఇండ్రస్టీస్ యజమాని(పేరు గోప్యంగా ఉంచారు) పరిశ్రమ నిర్మించారు. ఈ పరిశ్రమకు విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌ను బిగించారు. దీనికి విద్యుత్ సరఫరా కోసం ఏఈ కృష్ణను సంప్రదించగా రూ.50 వేలు డిమాండ్ చేశాడు. పరిశ్రమ యజమాని రూ.30 వేలకు ఒప్పందం చేసుకొని 17వ తేదీన రూ.10 వేలు ఇచ్చాడు. కాగా ఏఈ మిగితా డబ్బుల కోసం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. సోమవారం కాళ్లకల్‌లోని విద్యుత్ కార్యాలయంలో బాధితుడు రూ.20 వేలు ఏఈ కృష్ణకు అందజేశాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ చేపట్టి నాంపల్లి ఏసీబీ కోర్టు (2వ అదనపు స్పెషల్ కోర్టు)లో హాజరుపరుస్తామని తెలిపారు.

విలేకరి అరెస్ట్, రిమాండ్

మెదక్ మున్సిపాలిటీ: ప్రెస్ రిపోర్టర్ అని చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ పట్టణ సీఐ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణంలోని నర్స్‌ఖేడ్ వీధికి చెందిన చింతల సిద్దిరాములు మెగా ఇండియా యూట్యూబ్ ఛానెల్ రిపోర్టర్‌గా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీన పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఓ లారీని ఆపి డబ్బులు డిమాండ్ చేయడంతో డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిద్దిరాములుపై కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


సదానందం(ఫైల్)


స్వామి(ఫైల్)

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లికి చెందిన మైలారం స్వామి(26) పెయింటింగ్ వర్క్ చేస్తుండగా, సంగుపల్లికి చెందిన మన్నె సదానందం(27) ఫ్లవర్ డెకరేషన్ పని చేస్తున్నాడు. ఇద్దరూ ఆదివారం రాత్రి గజ్వేల్ నుంచి ముట్రాజ్‌పల్లి వైపు బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో మహిళా భవనం మలుపు వద్ద ప్రమాదవశాత్తు డివైడర్‌తోపాటు విద్యుత్ స్తంభానికి ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబాలు ఘటనా స్థలానికి చేరుకోగా, సమాచారం అందుకున్న పోలీసులు యువకుల మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్, ఆటో ఢీకొని వ్యక్తి..


నరేందర్‌రెడ్డి (ఫైల్)

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని రాంపల్లి గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాంపల్లి గ్రామానికి చెందిన నరేందర్ రెడ్డి(40) దుద్దెడ శివారులో గల టోల్ ప్లాజాలో సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు. రాంపల్లి గ్రామం నుంచి ఆక్సిజన్ పార్కు వద్ద ఉన్న రాజీవ్ రహదారికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి రాంపల్లికి ఇనుప రేకులతో వస్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఎదురెదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నరేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఫిట్స్ వచ్చి కిందపడి వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: ఫిట్స్ వచ్చి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని టైలర్ కాలనీకి చెందిన కుమార్ (29) సోమవారం ఉదయం ఫిట్స్ వచ్చి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి సోదరుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూలు బస్సు ఢీకొని ఏడేళ్ల బాలుడు మృతి

గుమ్మడిదల మండలంలో ఘటన


బాలుడి మృతదేహం వద్ద పడిపోయిన తల్లి

జిన్నారం(పటాన్‌చెరు): స్కూలు బస్సు ఢీకొని ఏడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. బీహార్ రాష్ట్రానికి చెందిన భజరంగి చౌహాన్ భార్య నిషాదేవి దంపతులు ముగ్గురు పిల్లలతో కలిసి బతుకు దెరువు కోసం బొంతపల్లి గ్రామానికి వచ్చి ఉంటున్నారు. సోమవారం భార్యాభర్తలిద్దరూ పిల్లలను ఇంటి వద్ద వదిలి పనులకు వెళ్లారు. సాయంత్రం బాలుడు సంతోష్ (7) ఆడుకుంటూ బాలానగర్–నర్సాపూర్ ప్రధాన రహదారి రోడ్డు దాటుతుండగా బాలానగర్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తల్లి నిషాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

దుబ్బాక: అప్పుల బాధతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన సోమవారం దుబ్బాక పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. పట్టణ కేంద్రానికి చెందిన శేర్వాణి మహేశ్(38) కుల వృత్తి చేనేత పరిశ్రమలో ఉపాధి లేక కిరాణ దుకాణంలో పని చేస్తున్నాడు. మహేశ్‌కు భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉండడంతో కుటుంబాన్ని పోషించడానికి సుమారు రూ.2 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురైన మహేశ్ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి..

సిద్దిపేటకమాన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. సీఐ ఉపేందర్ కథనం మేరకు.. దేవయ్య (45,) పద్మ దంపతులు కుటుంబంతో కలిసి స్థానిక గుండ్ల చెరువు ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. దేవయ్య కూలీ పనులు చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకెళ్లి కల్లు తాగి రాత్రి వచ్చాడు. ఇంటికొచ్చే క్రమంలో ఇతరుల ఫోన్ తనతోపాటు తీసుకొచ్చాడు. సెల్‌ఫోన్‌కు సంబంధించిన వారు ఫోన్ చేసి దేవయ్య ఇంటికి వచ్చి తమ సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లారు. అనంతరం దేవయ్య ఇంట్లో వేరే గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. ఆదివారం ఉదయం కూతురు కిటికీలో నుంచి చూడగా ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దొంగల బీభత్సం

ఎల్లమ్మ ఆలయంలో..


పొలాల్లో హుండీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి ఎల్లమ్మ ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండల పరిధి కొత్తపేట గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో దొంగలు చొరబడి హుండీ చోరీ చేశారు. ఇత్తడి శిఖరాన్ని సైతం దొంగలించారు. సోమవారం గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పరిశీలించారు. హుండీలోని డబ్బులను తీసుకొని గ్రామ శివారులోని పొలాల్లో పడేసి వెళ్లారు. హుండీలో మూడు నెలలకు సంబంధించిన డబ్బులు ఉన్నాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రామస్వామిగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు ఆలయాల్లో..

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో, మద్దూరు మండలంలోని గాగ్గిళ్లాపూర్ గ్రామంలోని శివాలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. రెండు ఆలయాల్లో హుండీ పగులగొట్టి సుమారు రూ.7 వేలు చోరీ చేశారు. ఆలయాల నిర్వాహకుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ద్విచక్ర వాహనంపై అనుమానంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తిని తనిఖీ చేయగా చిల్లర డబ్బులతో కూడిన డబ్బుల కవర్ లభించింది.

సోలార్ కంపెనీలో బ్యాటరీ..

చిన్నశంకరంపేట(మెదక్): సోలార్ కంపెనీలో బ్యాటరీ చోరీ జరిగిన ఘటన నార్సింగి మండలంలోని సంకాపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రెండు రోజుల కిందట సోలార్ కంపెనీలో బ్యాటరీ చోరీ చేసి గుర్తు తెలియని తీసుకెళ్తుండగా సెక్యూరిటీ గార్డు గమనించి వెంట పడ్డారు. దొంగ బైక్‌ను, బ్యాటరీని పాడుబడిన బావిలో పడేసి పరారీ అయ్యాడు. సోమవారం పాడుబడిన బావిలో బైక్, బ్యాటరీ కనిపించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కంపెనీ సిబ్బంది ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి భర్త హత్య
- మృతదేహాన్ని గ్రామ శివారులో పడేసిన వైనం
- ఏమీ తెలియనట్లు అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు
- భార్యతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌లో ఘటన


నారాయణ (ఫైల్)


లక్ష్మీ (ఫైల్)


రాకేశ్ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్తనే హత్య చేసింది భార్య. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. సోమవారం ఎస్‌ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన మల్లె నారాయణ(42) మూడేళ్ల కిందట ఉపాధి నిమిత్తం హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్ గ్రామానికొచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గ్రామంలోనే ఎఫ్‌పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) కార్యాలయంలో సీఈవోగా పని చేస్తున్నాడు. భార్య లక్ష్మీ సొంత మల్లుపల్లి గ్రామంలోనే ఉండేది. నాలుగు రోజుల కిందట భర్త వద్దకు రెడ్డి ఖానాపూర్ గ్రామానికి వచ్చింది. లక్ష్మీకి బిక్నూర్ మండలం రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు కడారి రాకేశ్‌తో వివాహేత సంబంధం కొనసాగిస్తుంది. ఈ విషయం తెలిసి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ఎలాగైన భర్తను అడ్డు తొలగించుకోవాలని పథకం వేసింది. పథకం ప్రకారం శుక్రవారం రాత్రి ప్రియుడు రాకేశ్, బిక్నూర్ గ్రామానికి చెందిన సాగర్ రమేశ్, దప్పు శ్రీకాంత్, కడారి శ్రీకాంత్‌తో కలిసి భర్త నారాయణను రెడ్డి ఖానాపూర్ గ్రామ శివారులోని సొసైటీ కార్యాలయం వద్ద హత్య చేసి మృతదేహాన్ని పల్పనూరు గ్రామ శివారులో పడి వేశారు. మరుసటి రోజు (శనివారం) ఏమీ తెలియనట్లు భర్త కనిపించడం లేదని హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం గ్రామ ఉదయం శివారులో మృతదేహం ఉందనే సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పటాన్ చెరువు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ నదిముద్దీన్ పరిశీలించారు. అనుమానితురాలుగా ఉన్న భార్యను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకుంది. లక్ష్మీ, రాకేశ్ తోపాటు వీరికి సహకరించిన మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు. లక్ష్మీ సైతం బీజేపీ బీసీ మహిళా మండలాధ్యక్షురాలు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.